# ఎండమావులు

"బ్రోచేవారెవరురా నినువినా రఘువరా" సాయంత్రం ఐదు గంటల వేళ సావిట్లో కూర్చుని మర్నాటి కూరకి గోరు చిక్కుడుకాయలు వల్చుకుంటూ మన సారా, మధురంగా, మైమరచి పాడుకుంటూంది శారదమ్మ. పాతికేళ్ళ తరువాత, మొగుడిపోయి ముప్పయ్యేళ్ళరోజున గొంగెత్తి పాడుకుంటూంది ఆవిడ. ఇటు అటు వాటా వాళ్ళు కిటికీల దగ్గిర, గుమ్మం దగ్గిర నిలబడి తొంగి చూడడం మొదలు పెట్టారు. "నవ్వి పోదురుగాక నాకేటి సిగ్గు" అన్నట్టు శారదమ్మ పట్టించుకోలేదు. పాతికేళ్ళు నోరు నొక్కుకున్నాను. ఇంక నాకేం భయం... నన్నడ్డేది, ఆపేది ఎవరు అనుకున్నట్టు ఆవిడ మైమరచి శ్రావ్యంగా పాడుకుంటూంది.

అప్పుడే స్కూలునించి వచ్చిన పద్మ గుమ్మం దగ్గిరే ఆగిపోయి తెల్లబోతూ అందరినీ చూసి లోపలికి తొంగిచూసింది. అమ్మ, అమ్మేనా పాడేది! అమ్మ యింత చక్కగా పాడగలదా, అమ్మ గొంతు యింత మంచిదా! అమ్మకింత బాగా సంగీతం వచ్చునా .... పుట్టిన యిరవై రెండేళ్ళలో ఎప్పుడూ అమ్మ పాడడం వినలేదే! కనీనం కూనిరాగమైనా తను వినలేదే! ఆరక్షణంలో ఆమెని చుట్టిముట్టిన ఆలోచనలు అవి!

గుమ్మందగ్గిర కూతురునిచూసి శారదాంబ చటుక్కున పాట ఆపేసింది. సిగ్గుతో మొహం కాస్త ఎర్రబడింది. పద్మ లోపలికి వచ్చి "అమ్మా...." అంటూ ఆశ్చర్యానందాలలో తల్లి బుజాలు పట్టుకుంది. "అమ్మా, నీకింత బాగా పాట వచ్చునని ఎప్పుడూ చెప్పలేదేమమ్మా....ఎప్పుడూ నీ పాటే వినలేదు. ఇంత మంచి సంగీతం వచ్చా నీకు...."

శారదమ్మ అదోలా నవ్వింది.... "ప్రఖ్యాత సంగీత విద్వాంసులు శంకర శాస్త్రిగారి అమ్మాయిని గదా. ఆ మాత్రం పాటరాదా అమ్మా.... మీ తాతగారు గురువుని మించిన శిష్యురాలిని చేశారు తల్లీ నన్ను." పద్మ ఆశ్చర్యంగా చూసింది. "మరి-మరింత సంగీతం వచ్చిన దానివి ఎప్పుడూ చెప్పలేదు. ఎప్పుడూ పాడలేదేమమ్మా. ఎందుకమ్మా ఈ విద్య దాచుకున్నావు-?"

శారదమ్మ నిట్టూర్చింది- "దాచుకోలేదమ్మా-నా గొంతు నొక్కేశారు తల్లీ... మీ నాయనమ్మ-మీ నాన్న కలిసి, నా గాత్రానికి సంగీతానికి పెళ్ళనాడే మూడు ముళ్ళ పేరుతో ఉరి బిగించేశారు తల్లీ" ఆవేదనగా అంది.

"అదేమిటమ్మా-" తెల్లపోతూ అడిగింది పద్మ.

"ఎందుకులే అమ్మా అదంతా యిప్పుడు- లే, లేచి కాళ్ల చేతులు కడుక్కొని ఫలహారం చేసి, కాఫీ తాగు అల్సిపోయి వచ్చావు....పద-" తను లేస్తూ అంది శారదమ్మ.

"తింటాగాని...ముందు నీవు అంతా చెప్పాల్సిందే, నాయనమ్మ, నాన్న ఎందుకు పాడద్దన్నారు." గబగబ వెళ్ళి కాళ్ళు కడుక్కొని టిఫిను ప్లేటు తెచ్చుకుంది పద్మ. శారదమ్మ మరిచిపోదామన్నా మరిచిపోలేని గతంలోకి వెళ్ళక తప్పలేదు.

* * *

సంగీత సరస్వతి నిలయమైన శంకరశాస్త్రిగారింట ఐదో పిల్లగా పుట్టింది శారద. ఊరందరి పిల్లలకి సంగీతంచెప్పి విద్యాంసులని చేసిన ఆయనకి తన పిల్లలు నలుగురిలో ఇద్దరు కూతుళ్లు ఇద్దరు కొడుకులలో ఏ ఒక్కరికీ సంగీతంమీద శ్రద్ధ, భక్తి, ఇచ్ఛలేకపోవడంతో హతాశులయ్యారు. ఆయన కృతి, శృతి అని ఆడ పిల్లలకి, కీర్తన్, చరణ్ అని మగపిల్లలకి పేర్లు పెట్టినందుకైనా ఎవరికీ సంగీతం అబ్బకపోవడంతో ఆయన చాలా నిరాశపడ్డారు నలుగురు పిల్లలు తరువాత ఐదేళ్ళకి మళ్ళీ అమ్మాయి పుట్టడంలో ఆ సరస్వతి దయ యీసారన్నా వుంటుందేమోనన్న ఆశతో "శారద" అని పేరు పెట్టుకున్నారు. ఆయన మొర ఆలకించినట్టు శారద పుట్టిన రెండేళ్ళనించే సంగీత పాఠాలు చెప్పించుకునే పిల్లల దగ్గిర వచ్చి కూర్చు నేది. తండ్రి పాట పాడుతూ తల ఊపుతూంటే తనూ తండ్రిని అనుకరించుతూ తల ఊపుతూ తాళం వేసేది...ఆ మాత్రానికే ఆయన పొంగిపోయేవారు. "శారదకి మాటతో పాటు పాట నేర్పడం మొదలుపెట్టేశారు ఆయన. వచ్చీరాని ముద్దు మాటలతో సా, పా అంటుంటే ఆయన కూతురికి అప్పుడే సంగీతం వచ్చినట్టే మురిసిపోయేవారు. మూడో ఏట మొదలు పెట్టిన సరిగమలు పదహారోఏడు వచ్చే సరికి తనతో సమానస్థాయికి తీసుకువచ్చారు శంకరశాస్త్రిగారు కూతుర్ని. కూతురి గొంతులో, శ్రావ్యానికి ముగ్ధులై అలా గంటల తరబడి పాడించుకుంటూ వింటూండే వారు. తెల్లవారుఝామున లేపి సాధన చేయించేవారు. పిల్లలకి పాఠాలు చెప్పే టప్పుడు దగ్గిర కూర్చోపెట్టేవారు. ఇంకేమీ నేర్పడానికి మిగలలేదన్నంత వరకు కూతుర్ని సంగీతంలో నిష్ణాతురాలిని చేశారు. సరస్వతీదేవి కటాక్షం అయితే అబ్బిందిగాని శారద పెళ్ళి వేళకి ఆ యింట్లో లక్ష్మీదేవి కటాక్షం లేకపోయింది. సంపాదించిన కాస్తో, కూస్తో, డబ్బు తాతలనాటి భూమి వగైరా ముందు పుట్టిన వారి పెళ్లిళ్ళకీ. చదువులకి సరిపోయింది. శారద వేళకి సంగీతపాఠాల సంపాదన మినహా ఆయన దగ్గిర ఏం మిగలలేదు. పచ్చగా, బొద్దుగా, చక్కటి సంగీతంపాడే తన

కూతుర్ని ఎవరన్నా కట్నకానుకలు లేకుండా చేసుకుంటారన్న ఆయన నమ్మకం శారదకి యిరవై ఏళ్లు నిండేసరికి సన్నగిలిపోయింది. కేవలం సంగీతాన్ని చూసి చేసుకునె కళారాధకులెవరూ తటస్థపడలేదు ఆయనకి. నాలుగైదు సంబంధాలు తిరిగి పోయాక కూతురి పెళ్ళి చింత పట్టుకుందాయనకి.

ఆ సమయంలో రామ్మూర్తి సంబంధం ఎవరో చెప్పారు. కుర్రాడు కలక్టరాఫీసులో గుమస్తా-ఒక్కడే కొడుకు. తండ్రి చిన్నప్పుడే పోతే తల్లి పెంచుకొచ్చింది. ఓ పెంకుటిల్లు, ధాన్యం వచ్చే కొద్ది భూమి వెనకా ముందు ఎవరూ బాదర బందీలు లేని సంబంధం-చూడడానికి అసలు బాగుండడు. నలుపు, మెల్లకన్ను, ఎత్తుపళ్ల—బంగారులాంటి శారదపక్కన అతన్ని చూడడానికి శాస్త్రిగారికి బాధ అన్పించింది.. కానీ, ఉద్యోగం యిల్లు, భూమి వున్నవాడే. కట్నకానుకలు ఏవో స్వల్పంగా అడిగినా ఈ సంబంధం వదులుకుంటే యీ మాత్రం తను మళ్ళీ తేగలడా.... మగాడికి అందం ఎందుకులే అని సరిపెట్టుకోక తప్పని సరి పరిస్థితి అయింది. అందం వక్రం అయితే పరవాలేదు బుద్ధీ వక్రబుద్ధే అన్నది పెళ్ళయ్యాకగాని ఎవరికీ తెలియదు.

అసలు పెళ్లి చూపులనాడే అతని తత్వం అర్థం చేసుకుని వుంటే.... అసు కునేది శారద తరువాత ఎన్నోసార్లు- తల్లి కొడుకులు పెళ్లి చూపులకి వచ్చారు. తల్లి అడుగడుగునా....మాటల్లో చేతల్లో మొగపెళ్లి వారం అన్నదాన్ని, దర్పం చూపించింది. ఆ గొంతులో కర్కశానికి ఆ మాటల్లోలేని సౌమ్యత అందరినీ చిన్న పుచ్చుకునేటట్టు చేసింది. రామ్మూర్తి వున్న అరగంట మూతి బిగించి, అదోరకం చూపులతో అందరినీ శల్య పరీక్ష చేస్తున్నట్లు కూర్చున్నాడు. శారదని తీసుకొచ్చి కూర్చోపెట్టాక అన్ని కోణాలనించి గుచ్చి గుచ్చి చూశాడు. ఎవరన్నా ఏమన్నా అనుకుంటారన్న మొహమాటమైనా లేకుండా-అతనిచూపులు వాడిగా గుచ్చుకున్నట్టే అనిపించింది శారదకి. సౌమ్యత, నమ్రత లేని అతని మొహం ఆమెకేం నచ్చలేదు-అందం లేకపోయినా కాస్త సరళంగా, సౌమ్యంగా వుంటే, మాట్లాడితే బాగుండేది అన్పించింది. శంకరశాస్త్రి గారు చాలా సంబరంగా కూతురి సంగీత జ్ఞానం గురించి, ఆమె కంఠం శ్రావ్యత గురించి సంగీతంలో ఎంతటి నిష్ణాతురాలో చెప్పారు. ఆయన అంత సంబరంగా చెప్పిన సంగతి ఎవరూ పట్టించుకోలేదు. ఆయన మొహం కాస్త చిన్నబోయింది. వారడగకపోయినా 'అమ్మాయిచేత పాడించుకుంటారా?'అని ఆయనే ఆరాటంగా అడిగారు—తల్లి కొడుకులు మొహాలు చూసుకున్నారు. తల్లి మూతి తిప్పింది.

"చెప్పారుగా పాడుతుందని—సంగీతం మాకేం తెల్సులెండి. అయినా పాట, ఆట కంటె ఆడపిల్లకి వని పాట రావాలి. అవి వచ్చునా"— తల్లి అడిగింది. ఆ మాటతో శారద కూడా చిన్నపోయింది—శంకరశాస్త్రిగారి మొహం మాడిపోయింది.

'అయ్యో! అమ్మాయికి అన్నీ వచ్చండి....చక్కగా వంట చేస్తుంది' అంది శారద తల్లి వెంటనే.

వాళ్లు వెళ్లాక శంకరశాస్త్రి ఆలోచనలో పడ్డారు. శారదకయితే మనసు నిండా ఏదో గుబులు. పెళ్ళివారిని సాగనంపి వచ్చిన పురోహితుడు, మధ్యవర్తి లోపలికి వస్తూ "సంబరంగా పిల్ల నచ్చిందన్నారు. వెయ్యినూట పదహార్లిచ్చి, వెండి కంచం చెంబు, ఉంగరం యిస్తే చాలన్నారు. ముహూర్తాలు పెట్టించమన్నారు" అన్నారు శంకరశాస్త్రిగారి మొహం, ఆలోచన చూసి యిద్దరూ కల్సి యీ మాత్రం సంబంధం ఆయన చచ్చినా తేలేరని, యిది వదులుకుంటే పశ్చాత్తాప పడవల్సి వుంటుందని, ఆయనున్న పరిస్థితుల్లో యింతకంటే తక్కువ కట్నం అడిగే సంబంధం దొరకదని చెప్పి చెప్పి ఓ అరగంటలో 'ఊ' అనిపించారు. "పాటకేం వుంది. అమ్మాయిని వాళ్లేం పాడుకోవద్దంటారా. వాళ్లకి సంగీత జ్ఞానం లేక కుతూహలం చూపించ లేదంతే." అని సర్దారు. శారదకి ఏమనడానికి మిగలలేదు. తండ్రి స్థితి, పెళ్ళికి ఆయన పడే ఆరాటం చూసి కాదనే సాహసం చెయ్యలేదు ఆమె—

పెళ్లినాడు బంధువులందరి బలవంతం మీద శారద పాటకచ్చేరి పెట్టించారు. పెళ్ళికొడుకు ఆ గంటా గంటన్నర ముళ్లమీద కూర్చున్నట్టే కూర్చున్నాడు. యిటు అటు కదులుతూ అత్తగారయితే ఆ చుట్టుపక్కల లేదు.

మొదటి రాత్రే....అతనెంత సరసుడో అర్థమయింది శారదకి! భర్తతో ధైర్యం చేసి మాట్లాడిన మొదటి మాట...."మీకు అసలు సంగీతం అంటే యిష్టం లేదా—పాటలసలు యిష్టం లేదా...."

రామ్మూర్తి యిటు తిరిగి అసలే వికారమయిన మొహాన్ని మరింత వికారంగా పెట్టి...."'ఆ,సా,పా' అంటూ సాగదీసే సంగీతమంటే నాకు అసహ్యం.... ఏదన్నా సినిమా పాటలయితే వింటాను అప్పుడప్పుడు" విసుగ్గా అనేసి పడుకున్నాడు.

ఆ మాటతోనే ఆమె సంగీతానికి సమాధి కట్టడం ఆరంభమయింది ఆనాటితో-

కాపురానికి వచ్చాక నెల రోజుల్లోనే ఈ పెళ్ళితో తన జీవితం ఎంత నరకమైంది అనుకున్న సంఘటనలు ఎన్నో! రామూర్తికి చిన్నప్పటి నించి తల్లి తప్ప మరో మనిషితో సంబంధం లేదేమో, ఆవిడ మాట వేదవాక్కు. తల్లి ఎన్నికష్టాలు పడి పెంచిందో విని, చూసి అతనికి తల్లే ప్రత్యక్షదైవం అయింది. ఆవిడకి చెప్పందే, అడగందే రూపాయి కూడా ఖర్చుపెట్టడు. భార్య రాత్రికి మాత్రమే

అతనికి అవసరం. తక్కినప్పుడంతా అమ్మే కాఫీ యివ్వాలి తల దువ్వాలి. అన్నం పెట్టాలి....ఏం కావల్సినా 'అమ్మా' అంటాడు తప్ప భార్య అనేది యింట్లో వుంద న్నది అతను గుర్తించలేదు! తల్లి ని పిలిచినపుడు ఆవిడ దగ్గిరిలో వున్నా శారద వెడితే 'అమ్మేది....పిలు' అంటాడు. తప్ప భార్యతో ఏం చెప్పడు. పెళ్ళయిన తరువాత కోడలికి యింటి పని వంట పని పూర్తిగా అప్పచెప్పేసింది. మడికట్టుకుని నూతిలో నీళ్ళు తోడుకోడం, వంట చెయ్యడం అంతా శారద మీదే పడింది. పనిలో ఏమాత్రం తేడా వచ్చినా కాంతమ్మ సహించేదికాదు....శారద పనికి భయపడేదికాదు. భర్త ప్రవర్తనకి బాధపడనంతగా ఆమె తన అదృష్టం యింతే అని సరిపెట్టేసు కుంది.

కాని....అత్తగారు, భర్తకి తన పాటమీద, సంగీతం మీద ఎందుకంత కక్ష. ద్వేషమో ఆమెకి అర్థం అయ్యేది కాదు! మొదట్లో అలవాటు ప్రకారం యింట్లో మాదిరి ఏ పని చేసుకుంటున్నా ఏకృతో పాడుకుంటూండేది. నూతిలో నీళ్ల తోడు తున్నా, మజ్జిగ చేస్తున్నా, వంట చేస్తున్నా రుబ్బురోలు దగ్గిర రుబ్బుతున్నా, అంట్లు తోముతున్నా ఆమె చేతులతో పాటు నోరు కదిలేది. కాపురానికి వెళ్ళిన పది రోజు ల్లోనే కాంతమ్మ ఆనోరుని సగంనొక్కేసింది. "అయ్యయ్యో....ఏమిటే ఆదోసకాయ చెక్కుతీయడం—అవ్వ అలాగేనా తీయడం, సగం కాయ తగలేసావు. అసలు నీ ధ్యాన పనిమీద ఏడుస్తేగా, ఎంతసేపు సాని పాపలా పాటలు తప్ప" విత్తరపోయింది శారద. "అవ్వ కుంపటి మీద పాలు అలా పొంగిపోతుంటే నీపాట తగలెయ్య— వళ్లు తెలియడం లేదే ఇదిగో ఆ అంట్లు తోమి తొరగా లోపలికి తగలడతావా, ఆ నూతి గట్టుమీదే పాటలతో కాపురం తగలడతావా."

"ఏమోనమ్మా—మాకాలంలో యిలా నోరిప్పడమే అత్తగారి ఎదుట యిలా పాటలు పాడడమే....అవ్వ... కలికాలం" అలాంటి విసుర్లతో మొదలుపెట్టి ఆవిడ రెండు నెలలు గడిచేసరికి శారదకి నోరు విప్పడం అంటే భయపడేట్టుగా తిట్టడం ఆరంభించింది.

కాపురానికి వచ్చిన రెండు నెలలు కాకుండానే శారదకి ఎదురయిన అనుభ వాలు. అత్తగారు తనని అన్నింటికి ఎందుకు తిడ్తుందీ తెలియదు. పాట పాడడం ఒక్కటే కారణం కాదన్నది చాలా రోజులకిగాని తెలియలేదు. సాయంత్రం మొహం అదీ కడుక్కోబోతే "దేవ్యం మొహం వాడు వచ్చేవేళకి కొత్త శుభ్రంగా వుండాలని తెలియదూ" అంటుంది. అందిగదా అని మర్నాడు స్నానంచేసి తెల్ల చీర కట్టుకుంటే "సంసారుల కొంపేనా ఇది. మా కాలంలో ఎరగమమ్మా యిలాంటి షోకులు. చచ్చి చెడి చాకిరి చేసి అర్థరాత్రి గదిలోకెళ్ళేవాళ్ళం. పట్టపగలే షోకులు

చేసుకుని మొగుళ్ళకోసం చూడడం… ” అని అనేది ఆవిడతో ఏం అంటే ఏం తప్పో, ఏం చేస్తే ఏం ముప్పో అని అనుక్షణం బెదిరిపోతూనే వుండేది. అత్తగా రెలా ప్రవర్తించినా కొత్త భర్త సానుభూతి, సహాయం వుంటే శారద యింత బాధ పడేది కాదేమో. తల్లి ఏమన్నా వినుక్కునప్పుడల్లా అతనూ వంత పాడుతూ "ఏమిటే ఆ పరధ్యానం ఆ వంటచేసేటప్పుడన్నా ఆ పాటలు మాని తిన్నగా వండి ఏడు."

"నీకు సంగీతం తప్ప మరే లోకం లేదేమిటి-నీ బోడి సంగీతం యీ యింట్లో వినిపించక్కరలేదు. నోరు మూసుకుని వుండు."

"అమ్మ చెప్పేది నీకొక్కదూ...యిదేం పాని కొంపా, రోజంతా పాడుకుంటూ కూర్చోడానికి-ఈసారినోరు విప్పించిందంటే చూడు-

అసలు రామూర్తికి సరసం అన్నదే తెలియదు. ఏనాడన్నా ఎప్పుడన్నా "శారదా...మంచి నీళ్ళుతే అనో...చొక్కా బొత్తాములు కుట్టు" అనో ఎదన్నాపని చెపితే ఆ మాత్రానికే అత్తగారు మొహం ముడిచేది. మొహం మొట మొట లాడించేది కొడుకు యింట్లోనించి వెళ్ళగానే మొదలు పెట్టేది. "అవ్వమాకాలంలో ఎరగవమ్మాయిలా పట్టపగలే పెళ్ళాన్ని పేరు పెట్టి పిలవడం, యిలా రాసుకు తిరగ డాలు." అంటూ సాగదీసేది. కొడుకు కోడలు మాట్లాడుకుంటే కూడా ఎందుకింత ద్వేషమో శారదకి అర్థమయ్యేది కాదు. ఆవిడకి మొగుడు ఏ అచ్చట ముచ్చట తీరకుండానే పోవడం. కాపురం చేసిన నాల్గు ఏళ్ళు, మొగుడు, అత్త కాల్చుకు తినడంతో ఆ కక్ష యిలా శారదమీద చూపిస్తున్నది. పొరుగింటావిడ ఓ రోజు శారద మీద సానుభూతితో చెప్పేవరకు తెలియలేదు. ధైర్యంచేసి ఓ రాత్రి రామూర్తితో

"మీ అమ్మగారెందుకు నా మీద అలా విరుచుకు పడతారు ప్రతిదానికి— ఏం నేనేం పనిచేయకుండా పాట పాడుకుంటూ కూర్చున్నానా....కొత్త వచ్చిన సంగీతం మరిచిపోకుండా సాధన చేసుకోడమూ తప్పేనా" అని అడిగింది.

రామ్మూర్తి ఆ మాత్రనికే కళ్లెరిమాడు. "చూడు మా అమ్మగురించి నాదగ్గరే మన్నా అన్నావంటే పళ్లు రాలతాయి— తమరు సంగీతం మరిచిపోతే లోకానికి వచ్చిన నష్టం ఏంలేదు. అమ్మ వద్దన్నప్పుడు మానవేం. నీకు ఎంతపొగరు" అన్న భర్తతో యింకేం చెప్పుకోడానికి ఏం మిగలలేదు. అత్తగారి తత్వం, భర్త మూర్ఖత్వంతో అసలు పాడుకోవాలన్న కోరిక తగ్గిపోయినా ఆమెలో ఏదో కక్ష. వీళ్ళకోసం నేనెందుకు మానాలి అన్న పంతం తలెత్తాయి. ఆ రోజునించి అత్తగారి అరుపులు పట్టించుకోకుండా కావాలని మరింతగా పాడడం మొదలు పెట్టింది.

కాంతమ్మ కోపానికి ఆ చర్య ఆజ్యం పోసినట్టయింది. నోటికివచ్చినట్లు తిడ్తున్న అత్తగారి వంక తీక్షణంగా చూసింది.

"సంగీతం అంటే శిశువులు, పశువులు కూడా పరవశిస్తాయంటారు. అలాంటి సంగీతాన్ని మీరు ఏహ్యించుకుంటున్నారంటే....హు....ఎద్దుకేం తెలుసు అటుకుల రుచి అన్న సామెత జ్ఞాపకం వస్తూంది. మిమ్మల్ని చూస్తూంటే" నాలుగు నెలలుగా మనసులో పేరుకున్నకసి, కక్ష, ఆవేదన అన్నీ కలిసి ప్రయత్నం లేకుండానే ఆమె నోట్లోంచి మాటలు వచ్చేశాయి. ఆ మాటలు పేడ నీళ్ళల్లా కాంతమ్మ మొహానికి తగిలినట్టు అయిపోయాయి. అసలే కోతి. కల్లు తాగిన కోతిలా అయిపోయింది కాంతమ్మ భద్రకాళి అవతారం ఎత్తింది. "నేను ఎద్దునే. ఎంత మాటన్నావే—నీకింత పొగరే. సానిముండలా సంగీతం పాడుతూంటే మేమంతా తల ఊపాలే నీ పాటకి పుండు, యీ రోజుతో మళ్ళీ. నోరిప్పకుండా చేస్తా...."అంటూ వీరావేశంతో పొయ్యిలో మండుతున్న కట్టెపేడు తెచ్చి మూతి మీద అడ్డంగా వాత పెట్టేసింది. శారద ఏం జరిగిందో తెల్సుకునే లోపలే ఆమె పెదాలు రెండూ నల్లగా మాడి పోయాయి. ఆ పుండు మానడానికి నెల పట్టింది-నోరు తెరవలేక, తిండి తినలేక నరక యాతన అనుభవించింది. ఆ అనుభవం చాలనట్టు సాయంత్రం రామ్మూర్తి యింటికి రాగానే జరిగిందంతా కల్లబొల్లి ఏడ్పులు ఏడుస్తూ చెప్పి-"నన్నంత మాట అందిరా—కోపం పట్టలేక వాత పెట్టాను." అంది. "బాగా చేశావు....మరి నోరెత్తకుండా బాగా బుద్ధి చెప్పావులే-కనీసం ఓ నెలన్నా నోరు మూసుకు పడివుంటుంది" అన్నాడు కొడుకు. అత్తగారు కాల్చిన వాతకంటె మొగుడన్న మాటలకి కుళ్ళి కుళ్ళి ఏడ్చింది శారద. ఆ రోజుతో ఆమె సంగీతానికి అగ్ని సంస్కారం జరిగిపోయినట్టు ఏడ్చింది. ఆమె ఆ యింట్లో మళ్ళీ నోరు విప్పలేదు-కాల్చుకు తిని తిని అత్తగారు పదేళ్ళకి పోయింది-ఆ పదేళ్ళలో రెండు గర్భాలు పోయాక, పద్మ పుట్టింది-ఆ తరువాత పుట్టిన మగపిల్లాడు కన్నిప్పకుండానే పోయాడు-అత్తగారు పోయిన పదో రోజున భర్త తనకెక్కడ స్వాతంత్రం వచ్చిందని అనుకుంటుందోనన్నట్టు "ఇదిగో అమ్మ లేదు గదా అని నీ యిష్టం వచ్చినట్లాడితే వూరుకుంటాననుకుంటున్నావేమో, పిచ్చి వేషాలు వేయకు" అని వార్నింగ్ యిచ్చాడు.

తను దురదృష్టవంతురాలు—కూతురికన్నా సంగీతం చెప్పించితే...."నోర్మూసుకో....నీ సంగీతంతోనే మేం చచ్చాం. దాన్ని కూడా పాడు చేయకు. పిచ్చి ఆలోచన్లు మాను...." పద్మ ఐదేళ్ళప్పుడు వచ్చిన ఆలోచనల్ని మొగ్గలోనే తుంచేశాడు. పద్మ యిరవై రెండేళ్ళ పిల్లయి, డిగ్రీ తెచ్చుకుని ఉద్యోగంలో చేరినా ఆ కోరిక అలాగే మిగిలిపోయింది ఆవిడకి.

ఇన్నాళ్ళకి.... పెళ్ళయిన పాతికేళ్ళకి.... మొగుడు పోయాక యింక అడ్డేవరు అన్నట్టు ఈ రోజు శారద నోరు విప్పింది....

* * *

"అబ్బ...అమ్మా...ఎలా భరించావమ్మా. .ఎలా పూరుకున్నావు నువ్వు... విన్న పద్మ ఆవేశంగా అడిగింది. "అలాంటి మొగుడు అత్తగారితో ఎలా కాపురం చేశావమ్మా...తాతగారి దగ్గిరకి వెళ్ళి పోవాల్సింది..."

"హు...పాతికేళ్ళక్రితం...ఓ ఆడపిల్ల యీనాడంత ధైర్యంగా భర్తని వదిలి వెళ్లే ఆలోచన ఎక్కడ చేయగలిగేది. అప్పుడు కాదు యిప్పుడు మాత్రం పుట్టింట్లోనే ఏ ఆసరా దొరుకుతుందని ఓ మధ్య తరగతి అమ్మాయి భర్తని. కాపురాన్ని వదులు కుని వెళ్ళగలదామ్మా..."

"ఛ....ఛ....సంగీతాన్ని వద్దనే వాళ్ళు....పాట వినని మనుష్యులు కూడా వుంటారంటే పోనీలే అమ్మా యీ రోజునించి నీవెప్పుడూ పాడుతూనే వుండాలిక. నాకూ సంగీతం నేర్పాలి. ఓ అరడజను మంది పిల్లలకి సంగీతం పాఠాలు చెప్పమ్మా నీకూ కాలక్షేపంగా కూడా వుంటుంది—" సంబరంగా అంది పద్మ.

* * *

ఓ పది రోజుల తర్వాత పద్మ స్కూలు నించి వచ్చేసరికి తల్లి ఎవరో అత నితో నవ్వుతూ మాట్లాడుతోంది. తల్లి మొహంలో ఏనాడూ చూడని వెలుగు, కళ్ళలో సంతోషం. ఇద్దరూ ఆప్యాయంగా, సంబరంగా మాట్లాడుకుంటున్నారు. పద్మ లోపలికి రాగానే "పద్మా....ఇదిగో యితనెవరో తెలుసా, గోపాలం అని నా బెస్ట్ ఫ్రెండు. ఫ్రెండు అంటే అతనూ మా నాన్నగారి శిష్యుడే....యిద్దరం సంగీతంలో పోటాపోటీగా వుండేవారం....మా యింట్లోనే వుండేవాడు. వారాలు చేసుకుంటూ వుండేవాడు. సంగీతం నేర్చుకున్నాక ఓ వూర్లో స్కూల్లో ఉద్యోగం దొరికాక వెళ్ళిపోయాడు....పాతికేళ్ళ తరువాత యీ రోజు కూరల బజారులో కనిపిస్తే యింటికి తీసుకొచ్చాను. శారదమ్మ చాలా సంబరంగా చెప్పుకుపోతుంది."

"మీ అమ్మ యింకా చాలా చెప్పలేదమ్మా నీతో—'గోపాలం అన్న ఆయన కొంటెగా శారదాంబ వంక చూస్తూ ఏదో చిలిపిగా చెప్ప బోయాడు. 'గోపాలం మతిపోయిందా .... యిప్పుడెందుకు ఆ మాటలు శారదాంబ గాభరాగా అంది. 'సరదాగా చెప్పుకుంటే ఏం? చెపితే నువ్వూ, నేను చిక్కుల్లో పడడానికి నీకు నాకు అడ్డేమి లేవుగా....

పద్మ కుతూహలంగా తల్లి వంక చూసింది. ఆవిడ మొహంలో ఎన్నడూ చూడని లజ్జ. ఎర్రబడ్డ మొహం దించుకుంది. "ఏం లేదమ్మా పద్మా ...మాది యిద్దరిదీ మూగప్రేమ, ఒకరంటే ఒకరికిష్టం వున్నా కులాలు వేరు. సద్బ్రాహ్మణుల అమ్మాయిని అడిగే సాహసం లేక మా ప్రేమ మా మనసుల వరకే పరిమితం అయిపోయింది-నోరు విప్పి చెప్పే ధైర్యం యిద్దరికీ లేకపోయింది-తన దగ్గిర సంగీతం నేర్చుకుంటూ వారాలు చేసుకుని బతికే ఓ కులంకాని అబ్బాయికి పిల్లనివ్వచ్చన్న ఆలోచన మీ తాతగారికి రాలేదు— కట్న కానుకలు లేకుండా నాకు నచ్చిన వాడు మీ కళ్ళ ఎదుటే వున్నాడన్న సంగతి చెప్పగలిగే తెగువ మీ అమ్మకి లేక మా ప్రేమ సమాధి అయిపోయింది.' చమత్కారంగా అన్నాడు....'ఏం శారదా అంతేనా' శారదమ్మ మొహంలో చిన్న మేఘం అలుముకుంది. ఆ రోజు అలా చెప్పగలిగే సాహసం చేసివుంటే నా జీవితం యిలా వుండేది కాదేమో...." అంది బాధగా.

"మీ రివాళ యిలా వచ్చారు.... మా అమ్మ మొహంలో ఏనాడూ చూడని సంతోషం చూస్తున్నాను....ప్లీజ్ మీరు వస్తూండండి—అమ్మకి కంపెనీ యివ్వండి. యిద్దరి అభిరుచులు ఒకటే గనక సంగీతం గురించి మాట్లాడుకోవచ్చు." పద్మ మనస్ఫూర్తిగా అంది గోపాలంతో.

గోపాలం గారి భార్య ఐదేళ్ళ క్రితం పోయిందట-కూతురికి పెళ్ళి అయింది-కొడుకెక్కడో ఉద్యోగం చేసుకుంటున్నాడట....అతని భార్యకి సంగీతం పట్ల ఏం మోజు లేదట. తల్లి చెప్తుంటే ఆ సంగతులన్నీ తెలిశాయి పద్మకి.

* * *

నాల్గు నెలలు గడిచాయి—యించుమించు రోజూ గోపాలం వస్తూండేవాడు. తల్లి ఆయనా కల్సి పాడుకుంటూ, వాదించుకుంటూ, కబుర్లాడుకుంటూ, నవ్వుకుంటూ మాట్లాడుకుంటూండేవారు, పద్మ యింటికి వచ్చేవేళకి— ఆ యింట్లో ఇన్నాళ్ళకి నవ్వులు వినిపిస్తుంటే పద్మకి ముచ్చటగానే అన్పించింది.

ఆర్నెల్లు గడిచాక పద్మ మనసులో ఆలోచన చోటు చేసుకుంది. ఓ రోజు తల్లి తో మనసులో మాట చెప్పింది. శారదాంబ తెల్ల పోయింది.

"పద్మా....మతి పోయిందా నీకు, ఏమిటా మాటలు.... నేను గోపాలంతో చనువుగా వున్నాననా యిలా అన్నావు.... యిలా ఎలా అనగలిగావు...." ఆవిడ గొంతు రుద్ధమయింది.

"ఏదో పాతికేళ్ళుగా మూగదానిలా పడున్న నాకు యీ రోజు మనసు విప్పి మాట్లాడుకునే మనిషి కనిపించేసరికి కొంత చనువుగా వున్నాను. అందు కోసం యిలా అంటావా"

"ఛా....ఛా....ఏమిటమ్మా, నేనన్నదేమిటి నీవు అన్నదేమిటి....మీ యిద్దరిని చూస్తుంటే నాకెంత ముచ్చటగా వుందో తెలుసా, యిలా అభిరుచులు కల్సి, గొంతులు కలిపి మీరిద్దరూ పాడుతూంటే....రోజూ యిలా వుంటే యిలా మీరిద్దరూ కల్సి వుండాలంటే....లోకం ఏం అనుకునే అవకాశం మనం యివ్వద్దని అందుకని అలా అన్నానమ్మా. ఏం తప్పేమిటి యిందులో" పద్మ అంది.

"తప్పు ఒప్పులలా వుంచు, నలభై ఐదేళ్ళకీ, మొగుడు చచ్చి ఆర్నెల్లు తిరగ కుండామళ్ళీ పెళ్ళి చేసుకుంటే లోకం మొహాన ఉమ్మేస్తుంది. ఇంట్లో పెళ్ళీడు కూతుర్ని పెట్టుకుని నన్ను పెళ్లి కూతుర్ని అవమనదానికి నీకు నోరెలా వచ్చిందే" ఆవిడలో ఆవేదన, ఉక్రోషం కల్సింది.

"లోకం సంగతి వదిలేయమ్మా నీకింకా నలభై మూడేళ్ళు. కనీసం యింకో ఇరవై ఏళ్ళ బ్రతుకుంది నీకు....రేపొద్దుట నాకు పెళ్ళి చేసి పంపాక నీకు తోడు నీడ ఎవరమ్మా, పేరుకి పెళ్లి, మొగుడు తప్ప ఆ జీవితంలో నీవేం సుఖపడ్డావు? ప్రేమకి, అనురాగానికి వయసడ్డా—నీకు నచ్చిన వాడితో, హాయిగా కొన్నాళ్ళయినా సుఖపడకూడదా అమ్మా"

"చాలింక వూరుకో....నాకున్న ఒకే ఒక్క కోరిక నీకు మంచి సంబంధం చూసి పెళ్ళిచేసి పంపడం.... నాకింతకంటె యింకేం అక్కరలేదు.' శారదమ్మ స్థిరంగా అంది.

ఆ తరవాత నెల రోజులు చెప్పి, చెప్పి, వాదించి, బ్రతిమాలి, అలిగి, తిండి మానేసి శారదమ్మ 'ఊ' అనేవరకు పంతం సాధించింది పద్మ—కాని తల్లి పెట్టిన ఓ షరతుకి తలవంచక తప్పలేదు పద్మకి. ఇంట్లో పెళ్లీడు కూతురుండగా తను చేసుకోదని, కూతురి పెళ్ళయ్యేకా తన సంగతని.... లేకుంటే యిలాంటి తల్లి కూతుర్ని ఎవరూ చేసుకోరని ఆవిడ వాదించి పద్మని వప్పించింది.

తల్లి ని వప్పించాక గోపాలంతో మాట్లాడింది పద్మ. అతనూ ముందు తెల్ల బోయాడు. ఆశ్చర్యపడ్డా తనూహించని, ఎదురు చూడని అవకాశం కాళ్ళముందుకు వస్తూంటే వద్దనే తెలివితక్కువవాడు కాదు. ఆనాడు అందని అనుభవం ఈనాడు కాస్త ఆలశ్యంగానైనా అందబోతూంటే ఆనందంకాక మరేమిటి. వున్న కూతురు, కొడుకు ఎవరి బతుకులు వాళ్లు బ్రతుకుతూంటే చేయి కాల్చుకుంటూ అవస్థపడు తున్నాడు. ఈ వయసులో వలచిన ప్రియురాలు చేయందిస్తానంటే అంతకంటె ఆనందం ఏముంది.

పద్మకి మంచి సంబంధమే కుదిరింది మూడు నెలల్లో. కాబోయే పెళ్ళికొడుకు బ్యాంకిలో ఆఫీసరు - మంచి కుటుంబం - పద్మ అతనితో ముందుగానే తల్లి గురించి

చెప్పింది. అతను సంస్కారుడు, సహృదయుడు కనక శారదాంబగురించి సాను భూతితో అర్థం చేసుకున్నాడు. పద్మ పెళ్ళికి ముహూర్తం నెల వుంది. ఆ పెళ్ళ య్యాక దేముడి గుడిలో శారదాంబ, గోపాలం పెళ్ళి సింపుల్‌గా జరపాలని నిర్ణ యించారు.

* * *

పద్మ పెళ్ళి అనుకున్న వేళకి నిర్విఘ్నంగా జరిగింది. ఇద్దరూ వారంరోజులు తిరిగి వచ్చారు. ఆ రోజు అనుకున్న ప్రకారం శారదమ్మ పెళ్ళి. గుడికి వెళ్ళాలి. శారదమ్మ తయారుకాలేదు-గోపాలం జాడ కనపడలేదు. పద్మ ఆరాటంగా ప్రశ్నలు కురిపించింది. శారదమ్మ తొణక్కుండా బెణక్కుండా శాంతంగా చెప్పింది.

"నేనే గోపాలాన్ని రావద్దన్నాను. నేనీ పెళ్ళి చేసుకోనని చెప్పేశాను"- పద్మ తెల్ల పోయింది. ఏదో అడిగే లోపలే ఆవిడ స్థిరంగా చెప్పింది. "ఈ పెళ్ళి చేసుకుని అపురూపంగా నాకు దొరికిన స్వేచ్ఛని మళ్ళీ పోగొట్టుకోదలుచుకోలేదమ్మా పద్మా. నీకు తెలియదమ్మా యీ మగవాళ్ళందరూ ఒకటే. పెళ్ళాం కానంతవరకే ఆవిడని ఆరాధిస్తారు. ఆవిడలో కళలని ప్రోత్సహిస్తారు. ఇంకోడి పెళ్లాంలో కనపడే సుగుణాలన్నీ తన భార్య కాంగానే పేలవమైపోతాయి-గోపాలన్నే చూడు-నా కోసం కొట్టుకుపోయేవాడు. రోజూ వచ్చేవాడు. గంటల తరబడి మాట్లాడేవాడు. నా పాటని నన్ను పొగిడేవాడు. అలాంటి గోపాలం మా యిద్దరి పెళ్ళి నిర్ణయం అయిన తరువాత చిత్రంగా మారిపోవడం మొదలుపెట్టాడు. సాన్నిహిత్యాన్ని మరింత దగ్గిరకి తీసుకురావల్సింది పోయి నాలో లోటు పాట్లు కనపడడం మొదలు పెట్టాయి. "అబ్బ ఏమిటి ఎప్పుడూ సంగీతం గోలేనా—యింకేం మాటలు లేవా" అపురూపంగా నా పాటని మెచ్చుకునే అతను అలా అనడం, నేనేదన్నా కొత్త ఎగతాళిచేస్తే ఉడుక్కుని మొహం మాడ్చుకోడం, ఏదన్నా సంగీతంలో తప్పు ఎత్తిచూపి ఇలా కాదంటే "మహా నీవే విద్వాంసురాలివి అనుకుంటావు. స్కూల్లో పాతికేళ్ళబట్టి పాఠాలు చెప్తున్నాను! అని మొహం మాడ్చుకోడం....అతని చూపులన్నీ నా శరీరం మీదే వున్నట్టు అతని ప్రవర్తన మారిపోయింది. పెళ్ళి కాకుండానే నా మీద అధికారం చెలాయించే ధోరణి మొదలుపెట్టాడు. "ఉన్నదంతా కూతురు పెళ్ళికే ఖర్చు పెట్టేస్తున్నావా అనే వరకూ వెళ్ళాడు" "ఎందుకొచ్చిన సంగీతం ఊరికే అలా రోజంతా పాడే బదులు పదిమంది పిల్లలకి పాఠాలు చెప్పరాదూ నాలుగు డబ్బులు వస్తాయి" యిదీ ధోరణీ.

"పెళ్ళి కాకండానే నా సంపాదనకోసం ఆరాటం! వంటరిగా యిద్దరం వున్నంతసేపు యీ వయసులోకూడా నా పొందు కోసం లేకిగా ఆరాటం. వద్దంటే మూతి ముడుచుకు వెళ్ళిపోవడం.... పెళ్ళి కాకుండానే అలకలు, చిరాకులు, పంతాలు, పౌరుషాలు. ఈ మూడు నాలుగు నెలల్లో జరిగినవన్నీ కూడదీసుకుని ఆలోచిస్తే గోపాలం మిగతా మగాళ్ళకంటె ఎందులోనూ ఉన్నతుడని నాకనిపించలేదు. పెళ్ళయ్యాక మీ నాన్న లాగే యితనూ నా పాటకి విసుక్కోవచ్చు. యిదే ధ్యాసా నీకు అని తిట్టచ్చు. నా నోరు మూయించచ్చు-లేదా, ఈ విద్యతో డబ్బు సంపాదించమని ఒత్తిడి తేవచ్చు. పద్మా, యీ వయసులో పెళ్ళి చేసుకుని లోకుల దృష్టిలో దిగజారడం మాటెలా వున్నా పెళ్ళి చేసుకుని నే పొందే సుఖం ఏమిటన్న ప్రశ్న నాలో తల ఎత్తింది! ఓ స్త్రీ తనని, తన కళని ఆరాధించే పురుషుడు దొరికితే అతనిలో ఐక్యం అయి, పరవశించాలని ఆశించడం ఉత్త కలేమోననిపిస్తుంది. అలాంటి అనుభూతులని ఆశించడం అత్యాశేనేమోననిపిస్తుంది- ఈ వయసులో నేనేం శరీర సుఖాలకోసం ఆశించడంలేదు....మీ నాన్న సాంగత్యంలో అలాంటి అనుభూతులు ఏనాడూ దొరకలేదు. అలాంటి సున్నిత భావాలన్నీ నాలో ఆనాడే చచ్చిపోయాయి! ఇప్పుడీ పెళ్ళి చేసుకుంటే ఆనాడు కోల్పోయినవి యిప్పుడు దొరుకుతాయని ఆశించడం ఎండమావుల కోసం పరిగెత్తడమేననిపిస్తూంది. ఇప్పుడీ పెళ్ళి చేసుకుని రెండోసారీ తప్పు చేశానని బాధపడేకంటె నాకు దొరికిన ఈ స్వేచ్ఛని, స్వాతంత్ర్యాన్ని అనుభవించనీయమ్మా, నా కోసం నేనై, నా యిష్టం వచ్చింది చూస్తూ, తింటూ హాయిగా పాడుకుంటూ బతకనీ అమ్మా! మళ్ళీ యీ బంధం నాకు వద్దు" శారదమ్మ ఆవేదనగా అంది.

పద్మ తల్లి వంక అలా చూస్తూండిపోయింది కాసేపు.... "మరి గోపాలం గారు....ఏమన్నారు? ఏమీ అనలేదా?"

"అన్నాడు. అరిచాడు. కోపం తెచ్చుకున్నాడు. మోసం అన్నాడు.... నాలాంటి ఆడదానికి మీ నాన్నలాంటి మొగుడే తగినవాడన్నాడు. నీలాంటి దాన్ని తన్ని మూల కూర్చోపెట్టి బాగా చేశాడన్నాడు...."నీకా శాస్తి సరి అయినదే" అన్నాడు. నన్నే కాక స్త్రీ జాతిని దుమ్మెత్తిపోశాడు. ఆడవాళ్ల అలా చేస్తేనే చచ్చినట్లు మూలపడి వుంటారన్నాడు. ఉక్రోషంతో అతనన్న మాటలు పట్టించుకోనక్కరలేదు. కాని.... అప్పుడు అతని మొహంలో కనపడిన క్రౌర్యం, అతనన్న మాటలు విన్నాక నేనీ నిర్ణయం తీసుకోడం మంచిదైంది అన్పించింది."

"కాని అమ్మా వంటరిగా...."

"వంటరి నెందుకయ్యానమ్మా. నా చుట్టూ యింతమంది జనం-అడవిలో లేను గదా. నాకు వచ్చిన విద్య పదిమందికీ పంచుతాను. చూడాలన్నప్పుడు నీ దగ్గిరికి వస్తాను. మరీ లేవలేని ముసలి వయసులో నీవు లేవూ...." ఆవిడ మనస్ఫూర్తిగా అంది.

"నీవేం బాధపడకమ్మా నా గురించి....ఎక్కడో నీరు దొరుకుతుందని ఎండ మావులవెంట పరిగెత్తే ఓపికలేదు. ఇచ్ఛాలేదు. పరిగెత్తి అవి ఎండమావులని తెలుసుకున్నాకా ఆ నిరాశని భరించే శక్తీ నాలో లేదు యింక. జీవితంలో మూడొం తులు గడిచిపోయింది. మిగతా ఒక భాగమన్నా నా కోసం బతకనీ తల్లీ-"

పద్మ యింక ఏం అనడానికి మిగలలేదు.

(వనిత) ★

# చేయూతనివ్వండి

"అమ్మా!"

కేక కాదది గావుకేక!

ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకి నిద్రలేచి బద్ధకంగా ఆవలిస్తూ వరండాలోకి వచ్చిన సుశీల, కింద చెట్లకింద ఎండు పుల్ల లేరుతున్న తల్లిని చూడ గానే ఒక్క కేక పెట్టింది.

సుశీల కేకకి బిక్కచచ్చిపోయి పుల్లలు కిందపారేసి గబగబ లోపలి కొచ్చే సింది రాజమ్మ. వీధి వరండాలో బంట్రోతు నర్సయ్యతో కబుర్లాడుతూ బీడి కాలుస్తున్న యాదయ్యకూడా ఆ కేకకి బీడి విసిరేసి పిల్లిలా లోపలికి నడిచాడు.

మెట్లుదిగి వినవిన హాలులోకి వచ్చింది సుశీల— "అమ్మా....ఏం చేస్తున్నావు అక్కడ—" అరిచినట్టే అడిగింది.

"నీళ్ళ కాగుకింద కొస్తాయని ఎండుపుల్ల లేరుతున్నాను...."నసుగుతూ అంది రాజమ్మ.